విద్యార్థులకు జగన్ మావయ్య కానుక

- ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- సాంకేతిక విద్యపై పట్టు సాధించడమే లక్ష్యం



గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను అందిస్తున్న నాయకులు

ఉప్పలగుప్తం: నేటి బాలలే రేపటి పౌరులన్నది జగమెరిగిన సత్యం. అందుకే బాలలను ఇప్పటినుంచే ప్రతిభావంతులుగా తీర్చిదిద్దటానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరంతర కృషి చేస్తుంది. 21వ శతాబ్దంలో విద్యార్థులకు అవసరమైన విద్యాబోధన అందించాలన్న తలంపుతో గతేడాది నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను అందిస్తున్నారు. అదే కోవలో ఈ ఏడాది సైతం ట్యాబ్‌ల పంపిణీ జరుగుతుంది. నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు జగన్ మావయ్య ఇస్తున్న కానుకపై అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నాడు–నేడుతో పాఠశాలల విప్లవాత్మక మార్పులు చేపట్టిన ప్రభుత్వం జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి, గోరుముద్ద, ఇంగ్లిష్ మీడియం బోధనలను తీసుకొచ్చి గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా విద్యకు అధిక ప్రాధాన్యమిస్తుంది. విద్యార్థులతో పాటు వారికి బోధన అందించే ఉపాధ్యాయులకు సైతం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. దీని కోసం ప్రభుత్వం ప్రతీ విద్యార్థికి రూ.32,000 ఖర్చు చేస్తుంది. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో గతేడాది ఎనిమిదో తరగతి విద్యార్థులకు 5,481, ఉపాధ్యాయులకు 675 ట్యాబ్‌లను ప్రభుత్వం అందించింది.

యానిమేషన్ వీడియో పాఠాలు

ఈ ట్యాబ్‌ల్లో వచ్చే యానిమేషన్ వీడియోలతో కూడిన పాఠాలు పిల్లలకు మరింత సులువుగా అర్థమవుతున్నాయి. బైజూస్ సంస్థ చెప్పే సైన్సు, సాంఘిక శాస్త్రం, లెక్కల పాఠాలతో విద్యార్థులు పూర్తి పరిజ్ఞానం పొందుతున్నారు. గతంలో విద్యార్థులు పాఠం నేర్చుకోవాలంటే కేవలం ఉపాధ్యాయులు చెప్తేనే అవకాశముండేది. ప్రస్తుతం ఉపాధ్యాయుల బోధనతో పాటు బైజూస్ ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు విద్యార్థులు ఆసక్తిగా నేర్చుకుంటున్నారు. సబ్జెక్టుకు సంబంధించి ఉపాధ్యాయుడు పాఠశాల సెలవు తీసుకున్నా విద్యార్థులు పాఠ్యాంశాలు నేర్చుకునేలా ట్యాబ్‌లు ఉపయోగపడుతున్నాయి. ప్రతీ పాఠ్యాంశం పూర్తయిన తర్వాత విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తూ తరువాత పాఠ్యాంశానికి వెళ్లే అవకాశాన్ని కల్పించారు. ప్యూవెట్ చార్ట్, ఈ–పాఠశాల యాప్‌లతో ఇంగ్లిష్ బోధన, ఏపీ డిక్షనరీ వొకాబలేరీ, విద్యార్థులకు అవసరమైన ఆటలను ట్యాబ్‌లో అనుసంధానం చేయటంతో విద్యార్థులకు మరింత ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం ప్రతీ మండలంలోనూ మొదటి దశగా 290 ట్యాబ్‌లను పంపిణీ చేయగా మిగతా ట్యాబ్‌లను రెండో పంపిణీ చేస్తున్నట్టు విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు చెబుతున్నారు.

రెండు నియోజకవర్గాల్లో గత రెండేళ్లుగా అందించిన ట్యాబ్‌ల వివరాలు

మండలం	గతేడాది ఇచ్చిన ట్యాబ్‌లు	ఈ ఏడాది ఇచ్చిన ట్యాబ్‌లు
అమలాపురం	1291	1070
అల్లవరం	788	619
ఉప్పలగుప్తం	686	595
ముమ్మిడివరం	751	592
ఐ.పోలవరం	780	667
తాళ్లరేవు	1148	1004
కాట్రేనికోన	712	542

సులభంగా నేర్చుకుంటున్నాం



గతేడాది ఎనిమిదో తరగతిలో ఉండగా నాకు ట్యాబ్ ఇచ్చారు. మాకు సైన్సు, సాంఘిక శాస్త్రం, లెక్కల పాఠాలతో పాటు ఇంగ్లిష్ పాఠాలు అర్థమయ్యేలా దీనిలో సాఫ్ట్‌వేర్‌లను రూపొందించారు. పాఠాలు మాకు సులభంగా అర్థమవుతున్నాయి. ప్రతీ సబ్జెక్ట్‌లోనూ గతం కంటే మెరుగ్గా పట్టు సాధించాను.

– మట్టపర్తి లావణ్య లహరి, విద్యార్థిని, గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, ఉప్పలగుప్తం మండలం

పూర్తి స్థాయిలో అందిస్తాం



బైజూస్ సంస్థతో అనుసంధానం చేసిన ట్యాబ్‌లు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం మండలంలో 290 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందించాం. మిగతా విద్యార్థులకు రెండో విడతలో పూర్తిస్థాయిలో అందిస్తాం.

– సత్తి సత్యకృష్ణ, ఎంఈవో–2, ఉప్పలగుప్తం మండలం

క్లుప్తంగా

మాజీ ఎంపీపీకి మంత్రి విశ్వరూప్ పరామర్శ



అమ్మాణి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: మాతృవియోగంతో బాధపడుతున్న మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ పరామర్శించారు. ఇటీవల ఈశ్వరరావు తల్లి అమ్మాణి అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం కొంకాపల్లిలోని ఈశ్వరరావు ఇంటికి మంత్రి విశ్వరూప్ వెళ్లి అమ్మాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, రూరల్ ప్రధాన కార్యదర్శి సూదా గణపతి, కౌన్సిలర్ దొమ్మేటి రాము, మాజీ సర్పంచ్ నక్కా సంపత్‌కుమార్ తదితరులున్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేత



లక్ష్మీపతిపురంలో విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేస్తున్న సత్తిబాబు

తాళ్లరేవు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా కంటి పరీక్షలు చేయించుకున్న విద్యార్థులకు శనివారం కళ్లజోళ్లను అందజేశారు. గాడిమొగ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపతిపురం, కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం విద్యార్థులు ఏడుగురికి కంటి వైద్య నిపుణుడు సీరం సత్తిబాబు కళ్లజోళ్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గోడిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



ఆయుష్మాన్ హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీదేవి

అల్లవరం: గోడిలో సర్పంచ్ తోట శ్రీదేవి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం లబ్ధిదారులకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులను అందించారు. కార్యక్రమంలో ఏపీఎం సయ్యద్, ఈటీపీఆర్‌డీ ఎన్‌వీవీ సత్యనారాయణ, బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ గనిశెట్టి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు సుంకర సాయి, కార్యదర్శి రవిరాజు, తోట నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బృందం



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన యానాం, పుదుచ్చేరి కాంగ్రెస్ నేతలు

యానాం: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శనివారం మాజీ సీఎం నారాయణసామి నేతృత్వంలో యానాం, పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం ఆఫీసులో ఆయనను దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగినపుడు పుదుచ్చేరి ఎంపీ వైథిలింగం అబ్జర్వర్ హోదాలో ఉన్నారు. కార్యక్రమంలో యానాం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్, నాయకులు కాటంశెటి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ముందస్తు న్యూఇయర్ వేడుకలు



న్యూ ఇయర్ వేడుకల్లో విద్యార్థులు

యానాం: పట్టణ పరిధిలో స్థానిక డ్రీమ్స్ స్కూల్‌లో శనివారం విద్యార్థులు నిర్వహించిన 2024 ముందస్తు న్యూఇయర్ వేడుకలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా జరిగిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులు తయారుచేసిన ఎకో ఫ్రెండ్లీ గ్రీటింగ్ కార్డులు ఆకట్టుకున్నాయి. అనంతరం కేక్ కట్ చేసి ఉత్సాహంగా న్యూఇయర్ వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మేనేజర్ శేరు వర్మ, హెచ్ఎం మాధ్యూ, టీచర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పొన్నాడకు ప్రముఖుల పరామర్శ



ఎమ్మెల్యే పొన్నాడ పినతండ్రి నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ తదితరులు

అమలాపురం టౌన్: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అమలాపురానికి చెందిన టిండర్ వ్యాపారి పొన్నాడ నాగేశ్వరరావు కుటుంబీకులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం ఎంపీ చింతా అనురాధతో పాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సంతాపం తెలిపారు. మృతి చెందిన పొన్నాడ నాగేశ్వరరావు ముమ్మిడిరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌కు స్వయంగా పినతండ్రి కావడంతో ఎమ్మెల్యేను జిల్లా వ్యాప్తంగా రాజకీయ పార్టీలకు అతీతంగా నాయకులు తరలి వచ్చి పరామర్శిస్తున్నారు. మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధతో పాటు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ తదితర ప్రముఖులు అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే పొన్నాడ ఇంటికి వచ్చి ఆయనను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే పినతండ్రి నాగేశ్వరరావు కుటుంబసభ్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే పొన్నాడతో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు అమెరికా దేశం నుంచి మృతహాలను భారత్‌కు రప్పించే ఏర్పాట్ల గురించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున కూడా ఆ దేశం నుంచి మృతదేహాలను రప్పించే ప్రయత్నాలు చేస్తోంది. అయిదు మృతదేహాలు విమానంలో 2వ తేదీ మంగళవారం భారత్‌కు చేరుకోనున్నాయి. హైదరాబాద్ లేదా విశాఖ ఎయిర్ పోర్టు నుంచి మృతదేహాలను స్వస్థలం అమలాపురం తీసుకొచ్చే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



సుంకరపాలెంలో డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తాళ్లరేవు: మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ సుంకరపాలెం రవి కళాశాల విద్యార్థులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సామాజిక కార్యకర్త సూరపరెడ్డి సురేష్ నేతృత్వంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అవగాహనా ర్యాలీని రవి కళాశాల ప్రిన్సిపాల్ పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. స్థానిక కళాశాల నుంచి యానాం –ఎదుర్లంక వంతెన వరకు జరిగిన ఈ ర్యాలీలో వేగం వద్దు – ప్రాణం ముద్దు అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ర్యాలీని ఉద్దేశించి సురేష్ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలు జరుగనున్న నేపథ్యంలో మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: స్థానిక గ్రామ పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పోతుమూడి కొండబాబు కుమారుడు నరేష్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2,50,000 చెక్కును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ క్యాంపు కార్యాలయంలో అందించారు. నరేష్ గతంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు ఆయన తండ్రి కొండబాబుకు చెక్కును మంత్రి విశ్వరూప్ శనివారం అందించారు. కార్యక్రమంలో ఉప్పలగుప్తం సొసైటీ అధ్యక్షుడు దంగేటి దొరబాబు, భోగిశెట్టి నరసింగరావు, చిక్కం మైనర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భవానీ మాలధారులకు భిక్ష

అంబాజీపేట: చిరతపూడికి చెందిన విజయదుర్గా భవానీల పీఠం ఆధ్వర్యంలో గురుభవాని కేతా దొరబాబు పర్యవేక్షణలో విజయవాడ దుర్గమ్మ ఆలయానికి మాలవిరమణకు పాదయాత్రలో వెళుతున్న భవానీలకు శనివారం భిక్ష పంపిణీ చేశారు. సుమారు 200 మంది భవానీలకు భోజనం, మంచినీరు అందిస్తున్నట్లు భవానీలు తెలిపారు. చిరతపూడి, కొత్తపేట, రావులపాలెం, సిద్ధాంతం తదితర ప్రధాన రహదారుల వెళుతున్న పాదయాత్ర భవానీలకు అందించారు.

మంచుకురిసే వేళలో...



అంబాజీపేటలో దట్టమైన మంచులో ప్రయాణిస్తున్న వాహన దారులు

అంబాజీపేట: మండలంలో శనివారం ఉదయం పది గంటలైనా మంచు వీడలేదు. వాహన చోదకులు దారి కనబడక ఇబ్బంది పడ్డారు. ప్రధాన రహదారుల్లో మంచు వల్ల దారి కనబడకపోవడంతో వాహనదారులు, సైక్లిస్టులు తడబాటు పడ్డారు. ప్రజలు మంచును తట్టుకోలేక ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. దట్టమైన మంచును సూర్యుడు చీల్చుకుని బయటకు వచ్చాడు. మంచుతో పాటు చలి కూడా విపరీతంగా ఉండటంతో ప్రజలు వణికిపోతున్నారు. ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని ప్రయాణికులు భయపడ్డారు. పగలు అధిక ఉష్ణోగ్రత, రాత్రి చలితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాగా మంచు కారణంగా మామిడి పూత పూయదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రామాలయం పునర్నిర్మాణానికి భూమి పూజ



బూరుగుపేటలో రామాలయ పునర్నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న నాయకులు

ముమ్మిడివరం: మండలంలోని కర్రివానిరేవు పంచాయతీ శివారు బూరుగుపేటలో రామాలయం పునర్నిర్మాణానికి సర్పంచ్ కాశీభాగ్యలక్ష్మి, జగపతి దంపతులు శనివారం భూమి పూజ చేశారు. టీటీడీ పాలక వర్గ సభ్యుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా ఆలయ పునర్నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. భూమి పూజలో ఎంపీపీ కోలా గంగా భవానీ, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, ఎంపీటీసీ గిరిగి వీరదుర్గాకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, కోలా బాబ్జీ, పాము కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో విజ్ఞాన్‌జ్యోతి శిక్షణ శిబిరం



విజ్ఞాన్‌జ్యోతి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు బోధిస్తున్న తరగతులు

యానాం: బాలికల్లో సాధికారితను పెంపొందించే లక్ష్యంతో భారత ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎస్‌టీఈఎం) ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రధానమంత్రి విజ్ఞాన్‌జ్యోతి కార్యక్రమంలో భాగంగా శనివారం శిక్షణా శిబిరం ప్రారంభమైంది. జనవరి 10వ తేదీ వరకూ నవోదయ విద్యాలయతో పాటు తాళ్లరేవు, యానాం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీయడం, ఇంటర్ బోర్డు పరీక్షల్లోను, ఎంసెట్, జేఈఈ, నీట్ పరీక్షల్లో విజయం సాధించేందుకుగాను ప్రముఖ ప్రొఫెసర్స్‌తో ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

కాట్రేనికోన: మండల పరిధిలోని చెయ్యేరులో పేకాట శిబిరంపై పోలీసులు మెరుపు దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని శనివారం అరెస్టు చేశారు. కాట్రేనికోన ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం చెయ్యేరులో పేకాట ఆడుతున్న సుధా వీరవెంకట సత్యనారాయణ, పోలిశెట్టి శ్రీనివాస్, గాలిదేవర బృహన్న రామకృష్ణ, గాలిదేవర సుబ్రమణ్యం, ఓలేటి ధనబాబు, పేరిచర్ల శ్రీరామరాజు, సంగాని పల్లంరాజులను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.32,180 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

పాము హల్‌చల్



పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ గణేష్ వర్మ

అమలాపురం రూరల్: మండలంలోని వన్నె చింతలపూడిలో రక్త పింజర పాము హల్‌చల్ చేసింది. వన్నెచింతలపూడి గ్రామస్తులు భయాందోళనతో స్థానిక సర్పంచ్ రాజారత్న నాగమణి కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు పరమట నాగమణి విష్ణు సహకారంతో భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం ఇచ్చారు. వర్మ వచ్చి రక్త పింజర పామును చాకచక్యంగా బంధించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పామును బంధించిన స్నేక్ క్యాచర్ వర్మను పంచాయతీ కార్యదర్శి పి.ధనలక్ష్మి, పంచాయతీ ఉద్యోగులు నాని, సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కుంచే వెంకటేశ్ తదితరులు అభినందించారు.

కూచిపూడి నృత్య కళాకారిణికి అభినందన



కొత్తపేటలో సత్యవాణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పెద్దిరాజు

కొత్తపేట: ప్రాథమిక స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ సంప్రదాయ నృత్య, కళా రంగాల్లో రాణించాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. ఈ నెల 24న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో 3,783 మంది కళాకారులు కూచిపూడి నృత్యం చేసి కళా వైభవాన్ని ప్రపంచానికి చాటారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి వైభవం మహాబృంద నాట్యం పేరిట లార్జెస్ట్ కూచిపూడి డ్యాన్స్ లెసన్ ప్రదర్శించారు. ఆ ప్రదర్శన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. ఆ ప్రదర్శనలో కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం ఫస్టియర్ విద్యార్థిని రావి సత్యవాణి పాల్గొని తెలంగాణ రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా సర్టిఫికెట్, మెమెంటో అందుకుంది. శనివారం సాయంత్రం స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో సత్యవాణి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారికి ఎంతో ఇష్టమైంది కూచిపూడి నృత్యం అని అన్నారు. కూచిపూడి నృత్య రూపకం గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కడం, ఆ ప్రదర్శనలో మన కళాశాల విద్యార్థిని సత్యవాణి ఉండటం కళాశాలకు ఎంతో గర్వకారణమని పేర్కొంటూ ఆమెను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, అధ్యాపకులు సత్యనారాయణ, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 27, 28 తేదీల్లో కళాప్రదర్శనలు

సఖినేటిపల్లి: మండలంలోని టేకిశెట్టిపాలెం విజేత స్కూల్ ఆడిటోరియంలో వచ్చే నెల 27, 28 తేదీల్లో కళాకారుల ప్రోత్సాహం నిమిత్తం రంగస్థల కళాప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. శనివారం వీవీమెరకలో గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించే వీటి బ్రోచర్‌ను ప్రతాప్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, స్థానిక కళాకారులతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వేర్వేరు ఏరియాలకు చెందిన కళాకారులు పాల్గొంటారన్నారు. కళాకారులందరికీ జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేస్తామన్నారు. అసోసియేషన్ కార్యవర్గ మెంబర్స్ డాక్టర్ కొల్లాబత్తుల జాషువా, కడలి కృష్ణారావు, అల్లూరి జానకి రామరాజు, మోరం నాయుడు, వాకా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక లేక అవస్థలు



యర్రగరువులో పంట పొలాల నుంచి శవాన్ని మోసుకెళుతున్న స్థానికులు

ఐ.పోలవరం: మండలంలోని యర్రగరువు గ్రామంలో శ్మశానవాటిక లేక అక్కడి ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి చెందిన భీమ్‌నగర్‌కు చెందిన పోతుల బాబులు(58) శనివారం మృతి చెందాడు. గ్రామానికి శ్మశానవాటిక లేకపోవడంతో సుమారు మూడు కిలోమీటర్లు పొలాల వెంబడి నడుచుకుంటూ శవాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. గ్రామంలో 400 గృహాలున్నాయని, రెండు వేల మంది నివసిస్తున్నామని ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు నానా అవస్థలు పడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరుతున్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



కోరంగిలో జరిగిన దివ్యాంగుల క్రిస్మస్‌లో దివ్యాంగులకు కిట్లు అందించిన దాతలు

తాళ్లరేవు: ఉషోదయా మండల వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం కోరంగిలో దివ్యాంగుల క్రిస్మస్ ఘనంగా జరిగింది. సామర్లకోట యూనివర్సల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎస్.రాజు సమక్షంలో దివ్యాంగులు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. దివ్యాంగులు పాటలు పాడుతూ ఉత్సాహంగా క్రిస్మస్ జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ దివ్యాంగులకు ఆలోచనా శక్తి ఎక్కువని, వారు ఎన్నో అద్భుతాలు చేస్తున్నారన్నారు. దివ్యాంగులను ఆదుకోవడానికి కుల, మతాలకతీతంగా అందరూ ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా దాతలు ప్రవీణ్‌రెడ్డి, మేరీ, మంజుల సమకూర్చిన నిత్యావసర వస్తువులు, కూరగాయలు, దుప్పట్లు, చీరల కిట్లను దివ్యాంగులకు అందజేశారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు కె.శ్రీనివాస్, సీతామహాలక్ష్మి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ల వినతి

అమలాపురం రూరల్: తెలంగాణ, కర్ణాటక మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే తమ జీవనోపాధి దెబ్బతింటుందని శనివారం కోనసీమ జిల్లా ఆంధ్ర ఆటోవాలా ఆటో వర్కర్స్ యూనియన్ సంఘం ప్రతినిధులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ని కలిసి విన్నవించుకున్నారు. అటువంటి నిర్ణయముంటే ఆటో కార్మికులకు న్యాయం జరిగేలా జిల్లా నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని యూనియన్ ప్రతినిధులు చెప్పారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఎల్లమెల్లి వెంకటేశ్వరరావు, ఊటాల వెంకటేష్, ఎల్లమెల్లి వెంకటేశ్వరరావు, బీది నాగభూషణం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ దంపతులు ప్రచురించిన 2024 నూతన క్యాలెండర్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో అవిష్కరించారు. కార్యక్రమంలో సలాది సతీష్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కలకంశెట్టి ఆదిత్య, అమలాపురం పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్, అయినవిల్లి జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, అమలాపురం రూరల్ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సలాది చక్రి, నందుల సత్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి అంగన్‌వాడీల సమస్యలు



మంత్రి విశ్వరూప్‌కు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ జిల్లా నాయకులు

అమలాపురం రూరల్: అంగన్‌వాడీల సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శనివారం అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, బేబి గంగరత్నం ఆధ్వర్యంలో అంగన్‌వాడీలంతా మంత్రి నివాసానికి వెళ్లి ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ సీఎం జగన్ మహిళా పక్షపాతి అని, న్యాయమైన కోర్కెలు తీర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.

నేడు విద్యుత్ బిల్లుల వసూళ్లు

అమలాపురం రూరల్: జిల్లాలో అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో ఆదివారం సెలవురోజైనా ప్రత్యేక విద్యుత్ బిల్లుల వసూళ్ల కౌంటర్లు పనిచేస్తాయని ఏపీఈపీడీసీఎల్ఈఈ మోకా రవికుమార్ శనివారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో బిల్లులు చెల్లించాలని కోరారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ ఆఫీస్ కలెక్షన్ సెంటర్లు, ఏటీపీ సెంటర్లలో బిల్లులు చెల్లించొచ్చన్నారు.